క్లుప్తంగా

డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్


జడ్జి విజయదుర్గ

భీమవరం: జాతీయ లోక్ అదాలత్ డిసెంబర్ 14వ తేదిన భీమవరం మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు భీమవరం 3వ అదనపు జిల్లా జడ్జి, సంస్థ చైర్మన్ పి విజయదుర్గ చెప్పారు. భీమవరం కోర్టుల ప్రాంగణంలో సివిల్, క్రిమినల్, ప్రీ లిటిగేషన్ కేసుల పరిష్కారం కోసం నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో కేసులను రాజీ చేసుకోవచ్చునన్నారు. సివిల్ కేసుల్లో రాజీపడితే అప్పటికే కట్టిన కోర్టు ఫీజు వాపసు వస్తుందన్నారు. లోక్ అదాలత్‌లో రాజీ అంతిమ తీర్పు కాబట్టి అప్పీలు చేసుకునే అవకాశం ఉండదని స్పష్టం చేశారు. జాతీయ లోక్‌అదాలత్ పట్ల న్యాయవాదులు, పోలీస్ అధికారులు కక్షిదారులకు అవగాహన కల్పించి ఎక్కువ కేసులు రాజీకి కృషి చేయాలని జడ్జి విజయదుర్గ సూచించారు.

ఉచిత బస్సు హామీ నెరవేర్చాలి


కాళ్లకూరులో నిరసన వ్యక్తం చేస్తున్న గోపాలకృష్ణంరాజు

కాళ్ల: ఏపీలో కూటమి ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన ఉచిత బస్సు హామీ నెరవేర్చాలని ఉండి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు డిమాండ్ చేశారు. బుధవారం కాళ్లకూరు గ్రామంలో పోస్టు కార్డు ఉద్యమాన్ని నిర్వహించారు. ముఖ్యమంత్రికి ఉచిత బస్సు హామీని నెరవేర్చాలని కోరుతూ పోస్టుకార్డులు రాయించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొల్లి సత్య శ్రీనివాస్, కొండా రాజేష్ కుమార్, గంజాల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

శ్రీనివాస్‌తో మాజీ మంత్రులు భేటీ


భీమవరంలో గ్రంధి శ్రీనివాస్‌తో మాట్లాడుతున్న పేర్ని నాని, కారుమూరి

భీమవరం: ప్రభుత్వ మాజీ విప్, భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను మాజీ మంత్రులు పేర్ని నాని, కారుమూరి నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీనివాస్ క్యాంపు కార్యాలయంలో బుధవారం భేటి అయిన మాజీ మంత్రులు ప్రస్తుత రాజకీయాలపై సుదీర్ఘంగా చర్చించారు.

రేషన్ షాపుల ఆకస్మిక తనిఖీ


రేషన్ షాపును తనిఖీ చేస్తున్న అధికారులు

పాలకోడేరు: మండలంలో రేషన్ షాపులను బుధవారం రెవెన్యూ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. తహసీల్దార్ నడింపల్లి భారతి విజయలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ రఘు, ఇతర అధికారులు పాలకోడేరు, విస్సాకోడేరు గ్రామాల్లోని రేషన్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ముఖ్యంగా రేషన్ నిల్వల్లో వ్యత్యాసాలు ఉన్నాయా? లేవా? అని పరిశీలించారు.

ఉపాధి హామీ పనులు వినియోగించుకోవాలి


గ్రామ సభలో మాట్లాడుతున్న టీఏ ఒమేగారాజు

ఉండి: ఉపాధి హామీ పనుల ద్వారా గ్రామాభివృద్ధి వేగంగా జరుగుతుందని ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ లంకపల్లి ఒమేగారాజు అన్నారు. ఉపాధి హామీ పనుల గుర్తింపు, అంచనాల తయారీ కోసం బుధవారం చెరుకువాడ గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద సర్పంచ్ కొండవేటి సాంబశివరావు ఆధ్వర్యంలో రెండవ దఫా గ్రామ సభ నిర్వహించారు.

నృత్య కళాకారిణులకు నగదు బహూకరణ

భీమవరం(ప్రకాశంచౌక్): అంతర్జాతీయ నృత్య సంగీత సమ్మేళనంలో ప్రథమ స్థానం సాధించిన కళాకారులు మన భీమవరానికే గర్వకారణమని భీమవరం త్యాగరాజ మ్యూజిక్ అకాడమీ అధ్యక్షుడు ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజు అన్నారు. శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఇటీవల హైదారాబాద్‌లో నిర్వహించిన అంతర్జాతీయ సంగీత నృత్య కళాకారుల సమ్మేళనంలో ప్రథమ స్థానం సాధించిన కళాకారులను అభినందించి, రూ.40 వేలు బహూకరించారు. కార్యక్రమంలో మ్యూజిక్ అకాడమీ సభ్యులు పాల్గొన్నారు.

వర్షాలతో వనామీకి వైరస్ విజృంభణ

వైట్ స్పాట్, విబ్రియో, ఈహెచ్‌పీ, వైట్‌గడ్ వ్యాధులతో రైతులు సతమతం


రొయ్యల చెరువులో ఏరియేటర్లు తిప్పుతున్న దృశ్యం


కొత్తపూసలమర్రు వైరస్‌బారిన పడిన రొయ్యలను గ్రేడింగ్ చేస్తున్న రైతులు

భీమవరం అర్బన్: గత మూడు నెలలుగా వర్షాలు పడుతూ వాతావరణంలో మార్పులు సంతరించుకోవడంతో వనామీ రొయ్యల సాగుపై తీవ్రంగా పడింది. దీంతో వనామీ పిల్లలు వేసిన 15 రోజుల నుంచి 35 రోజులలోపే వైట్ స్పాట్, విబ్రియో, ఈహెచ్‌పీ, వైట్‌గడ్ వంటి వ్యాధులు సోకడంతో రైతులు ఈ సీజన్‌లో తీవ్ర నష్టాలను చవి చూశారు. భీమవరం మండలంలో దిరుసుమర్రు, గొల్లవానితిప్ప, గూట్లపాడు, కొత్తపూసలమర్రు, అనాకోడేరు, నాగిడిపాలెం, వెంప, తోకతిప్ప, లోసరి, దొంగపిండి తదితర గ్రామాలలో సీజన్‌లలో సుమారు 7 నుంచి 10 వేల ఎకరాలలో వనామీ పెంపకాన్ని చేస్తున్నారు. ప్రస్తుతం 100 కౌంట్ నుంచి పట్టుబడికి వచ్చిన రొయ్యలు లేకపోవడంతో రొయ్య ధరలు అమాంతంగా పెరిగాయి. సీజన్‌లో ఆక్వా హబ్‌గా పేరుగాంచిన భీమవరం పరిసర ప్రాంతాలలో రోజుకు సుమారు 100 టన్నులకు పైగా విదేశాలకు ఎగుమతులు జరుగుతున్నట్లు ప్రాథమిక అంచనా. వేల కోట్లలో విదేశీమారకద్రవ్యం రాష్ట్రానికి చేకూరుతుంది. ప్రస్తుతం రొయ్యలు సీడ్ దశలోనే ఉన్నాయి.

వైరస్ ధాటికి మృత్యువాత పడుతున్న రొయ్యలు

రోజుకో రకంగా వాతావరణంలో మార్పులు సంతరించుకోవడంతో పీహెచ్, అమ్మోనియా, నైట్రోజన్, ఆక్సిజన్ శాతంలలో హెచ్చుతగ్గులు ఏర్పడి రొయ్యలకు వైట్ స్పాట్, విబ్రియో, వైట్‌గట్, తదితర వైరస్ రొయ్యలకు వ్యాప్తి చెంది మృత్యువాత చెందుతున్నాయని రైతులు చెబుతున్నారు. అంతేకాకుండా నాణ్యత లేని రొయ్యపిల్లలను విక్రయించడంతో చెరువులో రొయ్య పిల్లలు మృత్యువాత పడకుండా, ఎదుగుదల మందగించడంతో దొంగపిండి గ్రామానికి చెందిన ఒక రైతు 3 ఎకరాలలో వనామీ వేసి రూ. 16 లక్షలు నష్టపోయానని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వైరస్‌లు వల్ల 35 రోజుల లోపే రొయ్యలు మృత్యువాత చెంది తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల వనామీ రొయ్య ధరలు రికార్డు స్థాయిలో పెరగడంతో రొయ్య రైతులు ఒకసారైనా పంట ఫలించకపోతుందా అనే ఆశతో పెంపకం చేస్తున్నప్పటికీ ఆదిలోనే హంసపాదు ఎదురుకావడంతో రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు.

ఆక్సిజన్‌లో హెచ్చుతగ్గులు

చెరువులలో ఆక్సిజన్‌లో హెచ్చు తగ్గులు నియంత్రించేందుకు ఏరియేటర్లను నిరంతరం తిప్పాల్సి వస్తుందని రైతులు చెబుతున్నారు. రోజుకో రకంగా వాతావరణం ఉండటంతో నీటి పరమాణాల్లో హెచ్చు తగ్గులు ఏర్పడి చెరువు నీటిలో బ్యాక్టీరియా పెరిగిపోతుందని సీడ్ వదిలిన 15 రోజుల నుంచి 35 రోజుల వరకు విబ్రియో వ్యాప్తి ఎక్కువగా ఉండటంతో పాటుగా ఈహెచ్‌పీ వచ్చి రూ. లక్షల్లో పోగొట్టుకోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాణ్యమైన సీడ్‌ను అందించాలి



సీడ్ దశలో మాలాంటి సన్నకారు రైతులు హేచరీలు ఇచ్చే బోనస్‌కు ఆశపడి చెరువులలో పిల్ల వదిలితే అది ఎదగకుండా, వైరస్ రాకుండా ఉండటంతో రెండు నెలలకే చిన్న కౌంట్ రావడంతో తీవ్రంగా నష్టపోతున్నాం. ఈ ఏడాది రూ. 2 లక్షలు వరకు నష్టపోయాను. నాణ్యమైన సీడ్‌ను అందించే విధంగా చర్యలు తీసుకోవాలి

పెనుమాల నరసింహస్వామి,
రొయ్య రైతు, గొల్లవానితిప్ప

పోలీసు అమర వీరుల త్యాగాలు మరువలేనివి


కేజీఆర్ఎల్ ఫార్మసీ కళాశాలలో ర్యాలీ చేస్తున్నదృశ్యం

భీమవరం: పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా భీమవరం కేజీఆర్ఎల్ ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో బుధవారం పోలీసు అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా వన్‌టౌన్ సీఐ ఎం నాగరాజు మాట్లాడుతూ దేశ భద్రత కోసం ఎంతోమంది పోలీసులు అమరులయ్యారని వారిని స్మరించుకుంటూ ప్రతి ఏటా అమరవీరుల సంస్మరణ దినం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇతరులకు నష్టం కలుగకుండా విద్యార్థులు సత్‌ప్రవర్తనతో రేపటి తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, కళాశాల డైరెక్టర్ కవల నాగేశ్వరరావు, ప్రిన్సిపల్ డి రాఘవ, వైస్ ప్రిన్సిపల్ కె నిర్మల తదితరులు పాల్గొన్నారు.

భీమవరం టౌన్‌హాల్ ఎన్నికల్లో గందరగోళం


భీమవరం టౌన్‌హాల్ ఎన్నికల సందర్భంగా గందరగోళం దృశ్యం


భీమవరం టౌన్‌హాల్ వద్ద విలేకర్లతో మాట్లాడుతున్న కామన నాగేశ్వరరావు

భీమవరం: చరిత్ర కలిగిన భీమవరం ఎల్‌హెచ్ టౌన్ హాల్ కార్యవర్గం ఎన్నిక రసభసగా మారింది. బుధవారం టౌన్‌హాల్లో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశం అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోడానికి ఏర్పాట్లు చేశారు. రెండేళ్లకొకసారి నిర్వహించే ఎన్నికలు ఏకగ్రీవంగా కార్యవర్గాన్ని ఎన్నుకోవడం పరిపాటి. అయితే తెదేపా, జనసేన నాయకులు దీనిని రాజకీయం చేయడంతో ఎన్నికల్లో గందరగోళం ఏర్పడి చివరకు న్యాయస్థానాన్ని ఆశ్రయించే విధంగా మారింది. 1930లో ఏర్పాటు చేసిన టౌన్‌హాల్లో వివిధ రకాల క్రీడల నిర్వహణతో పేకాటలు నిర్వహిస్తారు. అయితే గత ఐదేళ్లగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా క్లబ్స్‌లో పేకాటకు అడ్డుకట్టవేయగా కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తరువాత తిరిగి జూదాల నిర్వహణ సాగిపోతుంది. దీనితో తెదేపా, జనసేన నాయకులు టౌన్‌హాల్‌ను వారి స్వాధీనంలోనికి తీసుకోవడంలో భాగంగా బుధవారం నిర్వహించిన ఎన్నికల్లో ఏకపక్షంగా నిర్వహించారని ఆరోపిస్తూ కొంతమంది సభ్యులు ఆందోళనకు దిగారు. 1,123 మంది సభ్యులుండగా బుధవారం నాటి ఎన్నికల్లో అధ్యక్ష పదవికి అయిదుగురు, కార్యదర్శి పదవికి ఆరుగురు నామినేషన్లు వేశారు. అయితే ఏకాభిప్రాయం పేరుతో కొంతమంది తెదేపా, జనసేన నాయకులు కలిసి సభ్యులు అభిప్రాయాలు తీసుకోకుండా ఏకపక్షంగా పదవులు కట్టబెట్టారని ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. దీనితో టౌన్‌హాల్ వద్ద గందరగోళం ఏర్పడింది.

●న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం

టౌన్‌హాల్ ఎన్నికలు సభ్యుల అభిప్రాయాలకు విలువ ఇవ్వకుండా ఏకపక్షంగా కమిటీని ఎంపిక చేశారని టౌన్‌హాల్ మాజీ కార్యదర్శి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కామన నాగేశ్వరరావు ఆరోపించారు. విలేకర్లతో మాట్లాడుతూ తెదేపా, జనసేన నాయకులు ఏకపక్షంగా ఎంపిక చేసిన కమిటీ చెల్లదని దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. ఎన్నికల్లో స్థానిక ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు), జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు జోక్యం చేసుకోవడం వల్లనే గందరగోళం ఏర్పడిందని విమర్శించారు. గవర శేషారావు మాట్లాడుతూ ఎన్నడూలేని విధంగా ఎన్నికలో గందరగోళం ఏర్పడిందని ఏకపక్షంగా కమిటీని ఎంపిక చేయడం మంచిదికాదన్నారు. ఇప్పటికైనా దీనిపై పునఃపరిశీలన చేయాలని లేకుంటే టౌన్‌హాల్ ప్రతిష్ఠకు భంగం కలుగుతుందన్నారు. విలేకర్ల సమావేశంలో సీహెచ్ గిరి, యిర్రింకి సత్యనారాయణ, డి దుర్గారావు, కె శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ క్యాంపులు వినియోగించుకోవాలి


మహదేవపట్నంలో నిర్వహిస్తున్న ఆధార్ క్యాంపుకు నిర్వహిస్తున్న దృశ్యం

ఉండి: ఈ నెల 22 నుంచి ప్రారంభమైన ఆధార్ ప్రత్యేక క్యాంపులను ప్రజలు తప్పక వినియోగించుకోవాలని మహదేవపట్నం సర్పంచ్ వనిమా సుబ్బలక్ష్మీ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మహదేపట్నంలో ఆధార్ క్యాంపును ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల ప్రజలు, విద్యార్థులతో ఆమె మాట్లాడుతూ ఆధ్యార్ క్యాంపులు చాలా ఉపయోగకరమన్నారు. మామూలు రోజుల్లో అయితే ఎక్కడ ఆధార్ కేంద్రం ఉంటే అక్కడికి ఎంతదూరమైన వెళ్లాల్సి వచ్చేదన్నారు. కానీ ఇప్పుడు మన ముంగిటికే ఆధార్ కేంద్రం రావడం సంతోషించదగిన విషయమన్నారు. కాబట్టి ఆధార్ కార్డు విషయంలో జరిగిన పొరపాట్లు,సమస్యలను తక్షణమే పరిష్కరించుకోవచ్చునన్నారు.పేర్లు, చిరునామా, డేట్ ఆఫ్ బర్త్, వేలిముద్రలు, ఫొటో అప్‌డేట్ వంటి సేవలన్నీ గ్రామస్థాయిలోనే పొందవచ్చునన్నారు. ముఖ్యంగా 15 ఏళ్ళు దాటిని వారంతా తప్పకుండా ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ జుత్తిగ నాగరాజు, వనిమా శ్రీనివాస్, గ్రామ పంచాయతీ కార్యదర్శి కె,.గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ఆటో ప్రచారం ద్వారా చోరీలపై అవగాహన


ఉండి సెంటర్‌లో ఆటో ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎస్సై నసీరుల్లా

ఉండి: ప్రజలు ఆదమరచి ఉంటే చోరీలకు అవకాశం కల్పించినట్టేనని ఉండి ఎస్సై నసీరుల్లా అన్నారు. జిల్లా ఎస్పీ అదేశాల మేరకు చోరీలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఏర్పాటు చేసిన ఆటో ప్రచార కార్యక్రమాన్ని బుధవారం ఉండి సెంటర్‌లో ఎస్సై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 19 గ్రామాల్లోను ఆటో ప్రచారం ద్వారా చోరీలపై ప్రజలకు అవగాహన కల్పించడమే కాకుండా జాగ్రత్తగా ఉండాలని తెలియచేస్తున్నట్లు తెలిపారు. చోరీలకు పాల్పడే దొంగలు ప్రజలకు మాయమాటలు చెప్పడం, దృష్టి మళ్లించడం వంటి పనులు చేసి సులభంగా చోరీలకు పాల్పడతారని తెలిపారు. అలాగే ప్రజలను సెంటిమెంటల్‌గా దెబ్బతీయం కూడా చోరీలకు పాల్పడేవారి పన్నాగంలో ఓ భాగమని అన్నారు. మెడలో ఆభరణాలు ధరించే వారు కొంత జాగ్రత్తగా ఉండాలన్నారు. ముఖ్యంగా ఆన్‌లైన్ మోసాలను కూడా జాగ్రత్తగా పసిగట్టాలన్నారు .వివిధ రకాలుగా ఫోన్‌లు చేసి ఓటీపీలు, ఆధార్ వివరాలు అడుగుతారని అవన్నీ మోసకరమైనవని జాగ్రత్తగా ఉండాలన్నారు.ఎ టువంటి లింక్‌లను తెలియకుండా ఓపెన్ చేయవద్దన్నారు. సైబర్ మోసాలకు గురైనా,అనుమానిత కాల్స్ వచ్చినా 1930 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు.

నాణ్యమైన వైద్య సేవలు అందించాలి


వైద్య సేవలపై ఆరాతీస్తున్న కలెక్టర్ నాగరాణి

పెనుగొండ: ప్రభుత్వాసుపత్రుల్లో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. బుధవారం పెనుగొండలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ సేవలను పరిశీలించి, రోగుల వార్డులను, ల్యాబ్, ఎక్స్‌రే యూనిట్, బ్లడ్ స్టోరేజ్ యూనిట్, మందుల లభ్యతను పరిశీలించారు. రోగులతో మమేకమై వారికి అందుతున్న వైద్య సదుపాయాలపై ఆరాతీశారు. గరిభిణులు, ప్రసవాల వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, వైద్యులు 24 గంటలూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దార్ జి.అనితకుమారి, వైద్యాధికారి డాక్టర్ చంద్ర సవేరి ఆమె వెంట ఉన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం


ద్విచక్ర వాహనాన్ని తీసుకువస్తున్న యువకులు

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు నుంచి భీమవరం వెళ్ళే పూలపల్లి బైపాస్ రోడ్డులో జరిగిన ఓ ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు తృటిలో ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం మధ్యాహ్నం అయ్యప్ప స్వామి ఆలయం ఎదురుగా ఉన్న పూలపల్లి బైపాస్ రోడ్డులో భీమవరం వైపు ఓ ఇన్నోవా కారు వేగంగా దూసుకుపోయింది. అదే మార్గంలో భీమవరం వైపుగా వెళుతున్న ఓ ద్విచక్ర వాహనదారుడిని ఢీకొట్టడంతో అతడే మోటర్ సైకిల్‌తో సహా సుమారు 20 అడుగుల లోతులో ఉన్న సర్వీస్ రోడ్డులోకి జారిపడిపోయాడు. స్థానికులు హుటాహుటిన కిందకు వెళ్లి ఆ ద్విచక్రవాహనదారుడిని పైకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడికి ఎటువంటి గాయాలు కాలేదు. బైక్‌ను ఢీకొట్టిన కారు ఆగకుండా వెళ్లిపోయింది.

గొర్రెలు, మేకలకు నట్టల నివారణ వ్యాక్సిన్ వేయించాలి


గొర్రెలకు నట్టల నివారణ వ్యాక్సిన్‌ను వేస్తున్న జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.మురళీకృష్ణ

నరసాపురం రూరల్: గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు తప్పనిసరిగా వేయించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.మురళీకృష్ణ అన్నారు. బుధవారం నరసాపురం నియోజకవర్గంలోని మొగల్తూరు మండలంలోని కాళీపట్నంలో 800 జీవాలకు, పేరుపాలెం గ్రామంలో సారవ గ్రామానికి చెందిన గొర్రెల కాపరి కైల వీర్రాజుకు చెందిన సుమారు 1200 గొర్రెలు, మేకలకు నట్టల మందును వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రెలు, మేకల్లో ఏలికపాములు, బద్దె పురుగు, లివర్‌ఫ్లూక్ మొదలగు అంతర పరాన్న జీవుల వల్ల అనేక అనర్థాలు సంభవించడం వల్ల గొర్రెలు, మేకల పెంపకందారులు 30 శాతం ఆదాయాన్ని కోల్పోతున్నారన్నారు. నట్టల నివారణకు గానూ ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న మందును గొర్రెలు, మేకలకు తాగించి రైతులు లబ్ధి పొందాలని సూచించారు. కార్యక్రమంలో నరసాపురం సహాయ సంచాలకుడు డాక్టర్ వై.సుధాకర్, పశువైద్యులు సురేంద్రకుమార్, నీలిమ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను సమన్వయంతో పరిష్కరించాలి

మొగల్తూరు: ప్రజల సమస్యలు ఏ శాఖకు వచ్చినా సంబంధిత అధికారితో పాటు అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుని సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్ కె.రాజకిశోర్ సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బుధవారం మండలంలోని అన్ని శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ సమావేశం ఏర్పాటు చేశామని, ముఖ్యంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన సమస్యలను పరిష్కరించే విషయంలో అధికారులను సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ సీహెచ్ త్రిశూలపాణి, ఎస్సై జి.వాసు, పీఆర్ ఏఈ వెంకటేశ్వరరావు, ఏఓ అబ్దుల్ రహీమ్, సీడీపీఓ నీలిమ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

నరసాపురం: పట్టణంలోని 216 జాతీయరహదారి లాకుల వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయపడినట్టు టౌన్ ఎస్సై సీహెచ్ జయలక్ష్మి చెప్పారు. పట్టణంలోని 22వవార్డు కొత్తకాలనీకి చెందిన బోడసింగు లక్ష్మీనారాయణ ఏటిగట్టు మీదుగా వీరభవానీ గుడివద్ద నుంచి బైక్‌పై వెళుతుండగా, ఓ వ్యక్తి మోటార్‌సైకిల్‌పై ఎదురుగా వచ్చి ఢీకొట్టాడు. దీంవతో లక్ష్మీనాయయణకు కాళ్లపై గాయాలు కావడంతో స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు మోటార్‌సైకిల్ నంబర్ ఆధారంగా ప్రమాదం చేసింది ఎవరనే అంశంపై దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వివరించారు.

రేపటి నుంచి మార్టేరు–కవిటం రోడ్డులో రాకపోకల నిలిపివేత

పెనుమంట్ర: మండలంలోని మార్టేరు– కవిటం రోడ్డులో రాకపోకలను శుక్రవారం నుంచి నవంబరు 12 తేదీ వరకు నిలిపివేస్తున్నట్లు పెనుమంట్ర ఆర్‌అండ్‌బీ ఇన్‌చార్జ్ ఏఈ ఆలపాటి యశ్వంత్ బుధవారం ప్రకటనలో తెలిపారు. నరసాపురం– అశ్వారావుపేట రోడ్డులో రహదారి విస్తరణ పనులలో భాగంగా మార్టేరు సెంటర్ నుంచి శ్రీకనక దుర్గమ్మ అమ్మవారి గుడి వరకు 700 మీటర్ల పొడవునా సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించామని, అందువల్ల ఈ రోడ్డులో వాహనాల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. అధ్వానంగా ఉన్న ఈరోడ్డు విస్తరించి పటిష్ఠ పరిచేందుకు మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాధరాజు కృషితో రూ. 25 కోట్లు సీఆర్ఐఎఫ్ నిధులు మంజూరు అయ్యాయి. దీంతో ఈ ఏడాది జనవరి 28న శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు కవిటం వద్ద శంకుస్థాపన చేయగా, విస్తరణ పనులను ప్రారంభించారు. అయితే ఎన్నికల కోడ్ రావడంతో నిర్మాణ పనులను నిలిపివేశారు. అవే పనులను తిరిగి ప్రారంభించిన అధికారులు మార్టేరు సెంటర్ నుంచి 700 మీటర్ల సీసీ రోడ్డు నిర్మించేందుకు మార్టేరు నుండి కవిటం వరకు వాహనాల రాకపోకలను 17 రోజుల పాటు పూర్తిగా నిలిపివేస్తున్నారు. ఈ నేపథ్యంలో నరసాపురం నుంచి తణుకు, రాజమండ్రి, ప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులు తదితర వాహనాలు లంకలకోడేరు, కొమ్ముచిక్కాల, ఆలమూరు మీదుగా మార్టేరు పాతవంతెన సెంటర్‌కు మళ్లిస్తున్నట్లు తెలిపారు. చిన్నవాహనాలు కవిటం, కొమ్ముచిక్కాల మీదుగా ఆలమూరు చేరుకోవచ్చని, ఇతర వాహనాలు కవిటం నుంచి ఓఎన్‌జీసీ రోడ్డు గుండా మార్టేరు చేరుకోవచ్చని ఆయన తెలిపారు.

వంటనూనె అధిక ధరలకు అమ్మితే చర్యలు

ఆకివీడు: వంటనూనెను అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ ఎస్. వెంకటేశ్వరరావు హెచ్చరించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని అన్ని కిరాణా దుకాణాలకు ముందుగానే హెచ్చరించి, ధరల పట్టికలను ఏర్పాటు చేయాలని సూచించామన్నారు. అయినప్పటికీ కొన్ని షాపుల యజమానులు వంట నూనెను అధిక ధరలకు అమ్ముతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. నిత్యావసర వస్తువులు అధిక ధరలకు అమ్మినా, బ్లాక్‌లో ఉంచినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

జాబ్‌మేళాలో 29 మందికి ఉద్యోగాలు


మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఆనంద కుమార్

ఆకివీడు: జాబ్ మేళాలో 29 మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు లభించినట్లు వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఆనంద కుమార్ చెప్పారు. మండలంలోని దుంపగడప గ్రామంలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జరిగిన జాబ్ మేళాలో ఉద్యోగాలు పొందిన వారి వివరాల్ని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముత్తూట్ ఫైనాన్స్, పేటీఎం, స్టాఫింగ్, టిటాన్స్ సంస్థలు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించాయన్నారు. జాబ్‌మేళాకు వివిధ కళాశాలల నుండి 81 మంది అభ్యర్థులు హాజరయ్యారన్నారు. స్కిల్ హబ్ కో–ఆర్డినేటర్ జి.శ్రీనివాస్, స్పోక్ డాక్టర్ సీహెచ్ విజయ్ అనిల్ డియా, ప్లేస్‌మెంట్ అధికారి కె.శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారం కోసమే రీసర్వే


విస్సాకోడేరు రెవెన్యూ సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ నడింపల్లి భారతి విజయలక్ష్మి

పాలకోడేరు: రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ పరంగా ఉన్న ఇబ్బందులను శాశ్వతంగా పరిష్కరించేందుకు గ్రామస్థాయిలో రీ–సర్వే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ భారతి విజయలక్ష్మి అన్నారు. ఈ సందర్భంగా రీ–సర్వే డిప్యూటీ తహసీల్దార్ కూనపరాజు సూర్యనారాయణ రాజు మాట్లాడుతూ పాలకోడేరు మండలం విస్సాకోడేరు గ్రామంలో బుధవారం నిర్వహించిన రీ–సర్వే రెవెన్యూ సదస్సుకు సంబంధించి 30 అర్జీలు వచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీనివాస్, సర్పంచ్ బొల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు లిఫ్ట్ పనులు ప్రారంభం


రైల్వే స్టేషన్‌లో లిఫ్ట్ పనులు ప్రారంభించిన దృశ్యం

సాక్షి స్పందన

ఆకివీడు: స్థానిక రైల్వే స్టేషన్‌లో లిఫ్ట్ పనులు ఎట్టకేలకు ప్రారంభించారు. మొదటి ప్లాట్ ఫారం నుంచి రెండో ప్లాట్ ఫారంకు వెళ్లేందుకు లిఫ్ట్ సౌకర్యం కల్పించేందుకు రైల్వే శాఖ నిధులు మంజూరు చేసింది. అయితే పనులు ప్రారంభించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఇటీవల సాక్షిలో నత్తనడకన రైల్వే లిఫ్ట్ పనులు కథనంతో ప్రచురితమైన వార్తకు స్పందించిన రైల్వే అధికారులు బుధవారం లిఫ్ట్ పనుల్ని ప్రారంభించారు. మొదటి, రెండో ప్లాట్ ఫారంలో పిల్లర్ల పనులు వేగంగా జరుగుతున్నాయి.

కాలువలో దూకి వ్యక్తి ఆత్మహత్య

పాలకోడేరు: కాలువలో దూకి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళ్తే అత్తిలి మండలం బొంతువారిపాలేనికి చెందిన వేంద్ర బాలాజీ (28)కి రెండున్నరేళ్ల కిత్రం వివాహమైంది. వీరికి ఐదు నెలల పాప ఉంది. అయితే భార్యాభర్తల మధ్య గొడవ నేపథ్యంలో సోమవారం బాలాజీ ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు గాలిస్తుండగా మంగళవారం పాలకోడేరు మండలం గొల్లలకోడేరు వద్ద పట్టుకున్నారు. అయితే బంధువులు అందరూ చూస్తుండగానే క్షణికావేశంలో అతడు శేరేగూడెం వద్ద కాలులో దూకి మృతి చెందాడు. మృతుని సోదరుడు ఆంజనేయులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పాలకోడేరు ఎస్సై ఎస్.హరిబాబు తెలిపారు.